సాక్షి సంగారెడ్డి

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



సెల్ఫీ విత్.. 'మా ఇంటి మట్టి గణపతి'

పర్యావరణాన్ని కాపాడుతూ.. భక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 'సాక్షి' సెల్ఫీ విత్ 'మా ఇంటి మట్టి గణపతి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇంటిలో ప్రతిష్ఠించిన ప్రతిమతో సెల్ఫీ దిగి, పేరు, చిరునామాతో వాట్సప్ ద్వారా పంపించాలి. మీరు పంపిన ఫొటోలు సాక్షి దినపత్రికలో ప్రచురితమవుతాయి. ఫొటోలు పంపించాల్సిన వాట్సాప్ ఫోన్ నంబర్లు

95058 72923, 99498 49479

– సంగారెడ్డి జోన్

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డి టౌన్ : రాజీమార్గంలో కేసులు పరిష్కరించడానికి పోలీస్ అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

- పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలి : డీఈఓ వెంకటేశ్వర్లు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని తొగర్‌పల్లిలో సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొగర్‌పల్లి, గోటీలగుట్ట తండా, మాచెపల్లి తండా, శివన్నగూడెం, దొబ్బకుంట, సీతారాంకుంట తండా, గంగారం, కోనాపూర్, జాలిగుట్ట తండాల్లోని పాఠశాలల విద్యార్థులకు షూ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 పాఠశాలల్లోని 700 మంది విద్యార్థులకు రూ.3 లక్షల ఖర్చుతో బూట్లు పంపిణీ చేయడం అభినందనీయమని డీఈఓ అన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్వామిగౌడ్, మల్లిక, సంతోష్ గౌడ్, ఎంఈఓ భీంసింగ్, దశరథ్, ప్రవీణ్, కృష్ణ పాల్గొన్నారు.

సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్‌కల్(అందోల్) : సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో రెండు క్రస్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. గురువారం మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాజెక్టు 4, 6 నంబర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం కూడా డ్యాంలోకి 16547 క్యూసెక్కుల వరద నీరు రాగా...దిగువకు 19వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అంతేకాకుండా జలవిద్యుత్ కేంద్రంలో రెండు టర్బయిన్‌ల ద్వారా 24గంటల్లో 2764 క్యూసెక్కుల నీటితో 0.3ఎంయూల విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు ఏడీఏ పాండయ్య తెలిపారు.

చివరి దశ దోస్త్ అడ్మిషన్లు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా అడ్మిషన్ పొందేందుకు చివరిదశ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఇప్పటివరకు అడ్మిషన్లు పొందని వారు, దూర ప్రాంతాలలో అడ్మిషన్ వచ్చిన వారు ఆన్‌లైన్‌లో రూ.400 చెల్లించి ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీట్ వచ్చినవారు ఈనెల 12, 13వ తేదీలలో కళాశాలలో అడ్మిషన్ పొందాలన్నారు. ఇతర వివరాలకు 9441069020 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ అస్లాం ఫారూఖీ తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్,-1, హిందీ-1, కామర్స్(ఇంగ్లీష్ మీడియం)-1, హిస్టరీ (తెలుగు మీడియం)-1, కామర్స్(ఉర్దూ మీడియం)-1, ఎకనామిక్స్ (ఉర్దూ మీడియం)-1 పొలిటికల్ సైన్స్(ఉర్దూ మీడియం)-1, బోటనీ (ఉర్దూ మీడియం)-1, జువాలజీ(ఉర్దూ మీడియం)-1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్‌సెట్ బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు బయోడేటా, సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేది మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం వివరాలు ఫోన్‌కు సమాచారం వస్తుందని చెప్పారు.

మెరుగైన వైద్యం అందించాలి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ మనోజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.



దౌల్తాబాద్ పీహెచ్‌సీలో ట్రైనీ కలెక్టర్ మనోజ్

మరిన్ని చెరువులు నింపేలా..



సింగూరు కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

సింగూరు లైనింగ్ పనులకు నీటిపారుదల శాఖ కసరత్తు

- మరో పక్షం రోజుల్లో టెండర్లకు పిలుపు
- లైనింగ్ పూర్తయితే పెరగనున్న ఆయకట్టు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సింగూరు కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా అదనంగా మరో 50కి పైగా చెరువులను సింగూరు నీటితో నింపాచ్చని నీటిపారుదలశాఖ భావిస్తోంది. ఈ లైనింగ్ పనులు పూర్తయితే నీటి వృథా, ఆవిరి నష్టాలు, త్వరగా నీళ్ల చివరి వరకు చేరే అవకాశాలుండటంతో అదనంగా చెరువులు నింపేందుకు వీలవుతుంది. ప్రస్తుతం ఈ కాలువలకు సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో 81 చెరువులను మాత్రమే నింపుతున్నారు. లైనింగ్ పనులు పూర్తయితే సుమారు 140 వరకు చెరువులను నింపొచ్చని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కాలువల కింద సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. పుల్కల్, ఆందోల్, మునిపల్లి, సదాశివపేట్ మండలాల పరిధిలో ఈ ఆయకట్టు ఉంటుంది. అదేవిధంగా 140 చెరువులు నింపడం ద్వారా ఈ చెరువుల కింద ఆయకట్టు 9,500 వరకు పెరుగుతుందని చెబుతున్నారు. 140 చెరువులను నింపడానికి మరిన్ని అదనపు కాలువల నిర్మాణం అవసరం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

లైనింగ్ పనులకు టెండర్లు

సింగూరు కాలువల లైనింగ్ పనులకు టెండర్లు పిలిచేందుకు నీటిపారుదలశాఖ సమాయత్తం అవుతోంది. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.168.30 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఈ మేరకు జీఓ నంబర్ 150ను రెండు నెలల క్రితం జారీ చేసింది. అంచనాల పరిశీలన పూర్తయింది. పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. టెక్నికల్ సాంక్షన్ రాగానే టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టారు. మరో పక్షం రోజుల్లో ఈ టెండరు నోటిఫికేషన్ విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కాలువల్లో పిచ్చి మొక్కలు

ప్రాజెక్టు కట్టినప్పటి నుంచి కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టలేదు. దీంతో కాలువల్లో చాలా చోట్ల పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. కొన్ని చోట్ల కాలువ మధ్యలో మొక్కలు కాస్త చెట్లుగా తయారయ్యాయి. దీంతో కాలువల ద్వారా నీటిని వదిలినప్పుడు చివరి ఆయకట్టుకు చేరడం కష్టంగా మారింది. ఈ క్రమంలో నీటి వృథా ఎక్కువగా అవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కాలువల సిమెంట్ లైనింగ్ పనుల కోసం రూ.168 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు మొత్తం మూడు కాలువలు ఉన్నాయి. లెఫ్ట్ మెయిన్ కెనాల్ (ఎల్ఎంసీ), రైట్ మెయిన్ కెనాల్ (ఆర్ఎంసీ), మెయిన్ బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ)లు ఉన్నాయి. వీటి పొడవు సుమారు 60 కి.మీల వరకు ఉంటుంది. డిస్ట్రిబ్యూటరీలు పొడవు సుమారు 81 కి.మీలు ఉంటాయి. ఈ కాలువలతో పాటు, డిస్ట్రిబ్యూటరీలకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టనున్నారు. సింగూరు కాలువలు, డిస్ట్రిబ్యూటరీల లైనింగ్ పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఈ పనులకు టెండరు ప్రక్రియ కొనసాగుతుందని నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఏసయ్య 'సాక్షి' ప్రతినిధితో తెలిపారు. టెక్నికల్ సాంక్షన్ రాగానే టెండర్లు పిలుస్తామని చెప్పారు.

భారీగా సభ్యత్వాల నమోదు చేపట్టాలి

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

హత్నూర(సంగారెడ్డి): బీజేపీ సభ్యత్వాలపై ప్రత్యేక దృష్టిసారించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధి షేర్‌ఖాన్ పల్లి గ్రామ శివారులోని పలుకుమీది నల్ల పోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతీ బూత్‌లో 200 సభ్యత్వాలు తగ్గకుండా నమోదు చేయించాలని కోరారు. నర్సాపూర్ నుంచి పలుగు పోచమ్మ ఆలయం మీదుగా జిన్నారం వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, దీని నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మురళీధర్ యాదవ్, రఘువీరారెడ్డి, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్, నాగప్రభ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

రోగులకు ఇబ్బంది కలిగించొద్దు

- జోగిపేట ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆర్డీఓ, డీసీహెచ్ఎస్

జోగిపేట(అందోల్): ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని ఆర్డీఓ పాండు, డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి అన్నారు. శుక్రవారం వారు జోగిపేట ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి, వైద్య సదుపాయాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లు, సిబ్బంది వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని స్థానిక ప్రజాప్రతినిధుల ఫిర్యాదుతోనే తనిఖీ చేసినట్లుగా తెలిసింది.

సంగారెడ్డిలో భారీ వర్షం

సంగారెడ్డి టౌన్ : కొన్ని రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం కూడా జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రహదారులపై వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



సంగారెడ్డిలో రోడ్లపై నిలిచిన నీరు

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలోని వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు క్రమం తప్పకుండా వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను పాఠశాలల అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన టాయిలెట్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలో ప్రహరీల నిర్మాణం పూర్తి చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. వసతి గృహాలలో మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయం పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత విద్యుత్ కావలసిన పాఠశాలల వివరాలు విద్యుత్ శాఖకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి దేవుజా, డీఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

మాకు ఫార్మా కంపెనీలు వద్దు



కంపెనీలు ఏర్పాటు చేయొద్దంటూ డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న రైతులు, భూ నిర్వాసితులు

భూములే కావాలి

- తేల్చి చెప్పిన డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ''మాకు ఫార్మా కంపెనీలు వద్దు.. సారవంతమైన మా భూములను ఎవరికీ ఇవ్వమని డప్పూర్, మల్గి, వడ్డి రైతులు తేల్చిచెప్పారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించి ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు శుక్రవారం మూడు గ్రామాల రైతులతో డప్పూరులో జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, రూరల్ సీఐ హన్మంత్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతులు, భూ నిర్వాసితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా 'ఫార్మాసిటీ వద్దు.. మా భూములు మాకు ముద్దు' అంటూ చాలాసేపు నినాదాలు చేశారు. మీ అభిప్రాయాలను రాత పూర్వకంగా రాసిస్తే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎస్పీ తెలిపారు. దీంతో ఫార్మా కంపెనీల ఏర్పాటుతో కలిగి కష్ట నష్టాల గురించి కాగితంపై రాసి రైతులు డీఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... మాకు ఉన్న కొద్దిపాటి భూముల్లో పంటలు పండించుకొని బతుకుతున్నాం. దయచేసి సహకరించాలని పోలీసులను అభ్యర్థించారు. బలవంతంగా భూములను తీసుకోవాలని చూస్తే ప్రాణత్యాగాలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. సమావేశానికి బీదర్ జెడ్పీటీసీ సభ్యుడు బాబురావు కూడా హాజరయ్యారు. సరిహద్దులో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడం వల్ల మా ప్రాంతం ప్రజలు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన కోరారు.




సర్కార్ బడులకు వెలుగులు

- బడులకు ఉచిత విద్యుత్ సరఫరా
- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆర్థికంగా వెసులుబాటు
- తప్పనున్న కరెంట్ చార్జీల భారం

సంగారెడ్డి జోన్: సర్కారు బడులకు కరెంటు బిల్లులు గుదిబండగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు వచ్చే నిధుల్లో సగానికి పైగా డబ్బు విద్యుత్ చార్జీల చెల్లింపులకే సరిపోతుంది. ఈ ఆర్థిక భారం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయ దినోత్సవం రోజున అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా కరెంటు అందివ్వాలని నిర్ణయించింది. ఈమేరకు విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి రోనాల్డ్ రోస్ దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉచిత విద్యుత్ వెంటనే అమలుచేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దీంతో ప్రతీనెల నిర్వహణ నిధుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించే ఇబ్బంది తొలిగిపోనుంది. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు ఉన్న విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులను జారీ చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలకు కూడా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండటంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రూ.3కోట్లకు పైగా బకాయిలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలో 1184 సర్వీసులు ఉన్నాయి. మొత్తం విద్యుత్ బకాయిలు రూ.3,83,497 ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు వివరించారు. విద్యా సంస్థల్లోనూ రోజురోజుకీ విద్యుత్ వినియోగం పెరుగుతుంది. తరగతి గదులలో లైట్లు, ఫ్యాన్లు వినియోగించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్ విద్యతో పాటు ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో బిల్లులు వేల రూపాయల్లో వచ్చేవి. అరకొర నిధుల నుంచి వీటిని చెల్లించడానికి ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడేవారు.



విద్యుత్ సరఫరాకు ప్రత్యేక వెబ్‌సైట్

పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) రూపొందించిన ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను రూపొందించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా యాడ్, డిలీట్, ఎడిట్ ఆప్షన్లు కల్పించినట్లు తెలుస్తోంది. పాఠశాలకు వచ్చే బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రతినెలా వచ్చే బడ్జెట్‌లో డిస్కంకు చెల్లించాల్సి ఉంటుంది. పాఠశాలల వారీగా వచ్చే విద్యుత్ బిల్లుల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నాయి.

పాఠశాలలకు ఆర్థికంగా వెసులుబాటు

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాఠశాలలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలగనుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి విద్యా సంవత్సరానికి నిధులు వచ్చేవి. ఇవి విద్యుత్ బిల్లులు కట్టేందుకు కూడా సరిపోయి కావని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలకమైన నిర్ణయంతో పాఠశాలకు విద్యుత్ భారం తగ్గుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. విధి విధానాల మేరకు ఉచిత విద్యుత్ పథకం అమలు పరచడం జరుగుతుంది.

– శ్రీనాథ్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, సంగారెడ్డి

మార్గదర్శకాలు విడుదల కాలేదు



పాఠశాలలకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన జీఓ విడుదలైన మాట వాస్తవమే. వీటిపై స్పష్టమైన మార్గదర్శకాలు మాత్రం విడుదల కాలేదు. గతంలో ఉన్న పాఠశాలల బిల్లులు కూడా మాఫీ చేస్తారా..? ఇక ముందు నుంచి వచ్చేవి ఉచితమా అనే విషయంపై స్పష్టత లేదు. కానీ పెండింగ్ బిల్లులకు సంబంధించి వివరాలు మాత్రం సేకరిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ

వరద సమస్యకు పరిష్కారం చూపండి



అధికారులతో కలిసి కాలనీలో పర్యటించిన కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: భారీ వర్షాలకు మండల పరిధిలోని ముత్తంగి, ఇస్నాపూర్ చెరువులు అలుగులు పారుతున్నాయని, వరద నీరు చిట్కుల్ గ్రామ పరిధిలోని పలు కాలనీలను ముంచెత్తింది. ముంపునకు గురైన రాధమ్మ, నాగార్జున, పార్థసారథి కాలనీలలో తహసీల్దార్ రంగారావు, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కవిత లతో కలసి శుక్రవారం కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ... రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భవిష్యత్‌లో చిట్కుల్ లోని కాలనీలు ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం కనుక్కోవాలని సూచించారు. అలుగులో నుంచి వచ్చే వరద నీరు నక్క వాగులోకి చేరేలా ఓపెన్ డ్రైనేజీ నిర్మించే విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. డీపీఆర్ ప్రతిపాదనలు రూపొందించి పంపితే ప్రభుత్వం నుంచి నిధులు రప్పించే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

గల్లీలోకి గణేషుడు

- వినాయక నవరాత్రి ఉత్సవాలు షురూ
- మండపాలు ముస్తాబు
- మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి

సంగారెడ్డి జోన్: పట్టణాలు, గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి షురువైంది. శనివారం గల్లీల్లో గణేషుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు మండపాలను అందంగా అలంకరించారు. విద్యుత్ వెలుగులతో జిగేలుమంటున్నాయి. ఇప్పటికే గణపతుల విగ్రహాలను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఈసారి అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను నెలకొల్పేందుకు యువకులు పోటీ పడుతున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా భారీ విగ్రహాలను కొనుగోలు చేశారు. విగ్రహాల సైజును బట్టి రూ.500 నుంచి రూ.90 వేల వరకు ధర ఉన్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు. 15 ఫీట్ల ఎత్తు వరకు విగ్రహాల వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1400కు పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే అవకాశం ఉందని పోలీస్ శాఖ అధికారులు వెల్లడించారు.



పూలు కొనుగోలు చేస్తున్న జనం



హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం

నవరాత్రి వేడుకలకు భారీ బందోబస్తు : ఎస్పీ రూపేష్

వినాయక చవితి పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వినాయక మండపాలను తప్పక సందర్శించి సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. నిమజ్జన సమయంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

క్లుప్తంగా

మట్టి వినాయకుడిని పూజిద్దాం : డీఎస్పీ రవీందర్



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ రవీందర్

పటాన్‌చెరు టౌన్: మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ డాక్టర్ ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమానికి డీఎస్పీ, తహసీల్దార్ రంగారావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రావు, చంద్రశేఖర్ రెడ్డి బస్వేశ్వర్ కాంగ్రెస్ నాయకులు ఏట్టయ్య ముదిరాజ్, యువరాజ్ మోరే, ధీరజ్ రెడ్డి, జీతయ్య, రవి ముదిరాజ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. లక్డారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు.

ఉపాధ్యాయులే కీలకం

- ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



సన్మాన కార్యక్రమంలో రఘోత్తంరెడ్డి

ములుగు(గజ్వేల్): దేశ భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం పాత్ర పోషిస్తారని ఎమెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ ములుగు మండల శాఖ అధ్యక్షుడు వెంకటనర్సింహ్మారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ములుగులో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంస్థలకు ప్రభుత్వం ఉచిత కరెంట్ అందించడం అభినందనీయమని సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సింగన్నగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు క్రాంతి కుమారిని ఎమ్మెల్సీ చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధానకార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల శిశువు మృతి

- ఆర్‌ఎంపీ వైద్యుడు నెబిలైజర్ పెడుతుండగా ఆగిన ఊపిరి
- కల్హేర్ మండలంలో ఘటన



శిశువు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి మంజుల

కల్హేర్(నారాయణఖేడ్): అభం శుభం తెలియని మూడు నెలల శిశువుకు నెబిలైజర్ ద్వారా ఆర్‌ఎంపీ డాక్టర్ వైద్యం చేస్తుండగా ఊపిరి ఆడక చనిపోయింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన బేగరి అనిల్, మంజుల దంపతులకు ఇటీవలె శిశువు భానుప్రియ జన్మనిచ్చింది. భానుప్రియకు జలుబు, జ్వరం రావడంతో తల్లిదండ్రులు నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. అయినా ఆరోగ్యం బాగుపడలేదు. నాలుగు రోజుల కిందట పక్కనే ఉన్న కృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ మొహ్మద్ అలీని సంప్రదించారు. శ్వాస సమస్య కోసం నిత్యం నెబిలైజర్ పెడుతున్నారు. రోజుమాదిరిగా శుక్రవారం కూడా పెడుతుండగా ఊపిరి ఆడక శిశువు చనిపోయింది. వైద్యుడి నిర్లక్ష్యంతోనే శిశువు చనిపోయిందని కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. కోపంతో వైద్యుడి ఇంటిపై దాడికి యత్నించారు. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం, సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. వైద్యుడి తరఫున రూ. 1.75 లక్షలు ఆర్థిక సాయం చేసేందుకు ఇరువురు రాజీ కుదుర్చుకున్నారు.

భూములు భోం చేస్తున్నారు



అటవీ భూములపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడవుల సంరక్షణకోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి అధికారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా.. వాటిని సంరక్షణలో అధికారులు విఫలమతున్నారు. దీంతో అక్రమార్కులు దర్జాగా భూముల కబ్జాగా పాల్పడుతున్నారు. మెదక్ జిల్లాలో అడవుల విస్తీర్ణం 57 వేల హెక్టార్లలో ఉండగా ఇప్పటికే 12 వేల హెక్టార్లు ఆక్రమణకు గురైంది. ఆక్రమణలు ఇలాగే కొనసాగితే రాబోయే భావితరాల పిల్లలకు ఒకప్పుడు జిల్లాలో అడవి సంపద సమృద్ధిగా ఉండేదని చెప్పుకునే పరిస్థితి నెలకొంటుంది. ఆక్రమణకు గురవుతూ కనుమరుగవుతున్న అడవులపై కథనం...

దర్జాగా అటవీ భూములు కబ్జా

- జిల్లాలో అడవుల విస్తీర్ణం 57 వేల హెక్టార్లు
- 12 వేల హెక్టార్లు ఆక్రమణ
- కేసులు నమోదు చేసినా మారనితీరు
- అడ్డుకుంటే అధికారులపై దాడులు

పాపన్నపేట మండలం నామాపూర్ గ్రామంలో చదును చేసిన అటవీ ప్రాంతం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా అంటేనే పచ్చని అడవి ప్రాంతానికి పెట్టింది పేరు. జిల్లాలో 21 మండలాలు ఉండగా అందులో ప్రధానంగా మెదక్, రామాయంపేట, పెద్దశంకరంపేట, కొడిపల్లి, నర్సాపూర్, తూప్రాన్ మండలాల్లో దట్టమైన అడవి విస్తరించి ఉంది. ఈ మండలంలోని చాలా గ్రామాలు అడవిని ఆనుకొని ఉంటాయి. ఇదే అదనుగా చేసుకొని కొంతమంది అక్రమార్కులు అడవులను రాత్రివేళ చదును చేసుకుంటూ వేలాది ఎకరాలను కబ్జా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా...అటవీశాఖ అధికారులు మాత్రం నామ మాత్రపు కేసులతో సరిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దాడులకు ఎగబడుతున్న కబ్జాదారులు

గతంలో జిల్లాలోని పాపన్నపేట మండలం నామాపూర్ పరిధి, టేక్మాల్ మండలం చంద్రుతండాలో అక్రమార్కులు రాత్రి సమయంలో అటవీ భూములను బుల్డోజర్లు, ట్రాక్టర్లు పెట్టి చెట్లు నరుకుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకున్నారు. అక్రమార్కులు ఫారెస్ట్ అధికారులపై మూకుమ్మడిగా వెంటపడి దాడి చేశారు. కర్రలతో విచక్షణా రహితంగా కొట్టారు. ఈ ఘటనలో 9 మందిపై కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి ఫారెస్ట్ అధికారులు అటువైపు వెళ్లలేదని, ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు విచ్చలవిడిగా ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఆ భూములు అక్రమార్కుల చేతుల్లోనే ఉన్నాయే తప్ప ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకోలేకపోయారు. జిల్లాలో జరుగుతున్న అడవుల ఆక్రమణకు ఇది ఒక నిదర్శనంగా చెప్పవచ్చు.

కేసులతోనే సరి..

చిన్నపాటి మొక్కలను తొలగిస్తే రాద్ధాంతం చేస్తూ కేసులు, ఫైన్ చర్యలకు పాల్పడే అధికారులు అటవీ భూములను కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. వారిపై నామమాత్రపు కేసులు నమోదు చేస్తున్నారు. అక్రమార్కులు అటవీభూములు ఆక్రమణలపై హవేళిఘణాపూర్ మండలం గాజిరెడ్డిపల్లి, మెదక్ మండలం అవుసులపల్లి గ్రామ శివారులోనిగల అటవీభూములను ఆక్రమించగా ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారు. అయినా అటవీభూముల ఆక్రమణలు ఆగడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అటవీ భూములను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

57 వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం

మెదక్ జిల్లాలో 57 వేల హెక్టార్లు (లక్షా 44వేల ఎకరాలు) అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇప్పటి వరకు 12వేల హెక్టార్ల (30వేల ఎకరాలు) అటవీ భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం. ఇందులో 2 వేల హెక్టార్ల వరకు ఫారెస్ట్ అధికారులు రికవరీ చేశారు. 2014 నుంచి అటవీ భూమి ఆక్రమణకు పాల్పడిన వారిపై 328 కేసులు నమోదు చేశారు. జిల్లాలోని అటవీ భూములను ఆనుకొని ఉన్న భూములను సాగుచేస్తున్న వారికి 2008లో మొదటి విడత, 2023లో మరోసారి పట్టాలిచ్చింది. ఇప్పటి వరకు 2005 కంటే ముందు అటవీ భూములను ఆనుకొని ఉన్న భూములను సాగు చేసుకుంటున్న 1,969 మందికి 1,683 ఎకరాల పోడు భూమి పట్టాలను ప్రభుత్వం ఇచ్చింది. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి పోడు భూములు లేవు.

జిల్లాలో రెంజ్‌ల వారీగా అటవీ విస్తీర్ణం

రేంజ్	హెక్టార్లలో విస్తీర్ణం
మెదక్	11,094.045
రామాయంపేట	9,204.185
తూప్రాన్	13,157.402
నర్సాపూర్	11,395.438
కౌడిపల్లి	7,119.06
పెద్దశంకరంపేట	5,657.294
మొత్తం	57,627.424

కబ్జా చేస్తే కఠిన చర్యలు



జిల్లాలో అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా రాత్రి వేళలో సైతం అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్నాం. అనుమతులు లేకుండా చెట్లు నరకడం, అటవీభూముల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జోజి, ఫారెస్ట్ జిల్లా అధికారి, మెదక్



ఒక్క గ్రామంలోనే 400 ఎకరాలకు పైగా కబ్జా

జిల్లాలోని ఒక్క హవేళిఘణాపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామంలో సుమారు 400 ఎకరాలకు పైగా అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు సమాచారం. అలాగే చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి, టీ.మాందాపూర్ గ్రామాల్లో వందలాది ఎకరాల్లో అటవీభూమి ఆక్రమణకు గురైంది. మెదక్ మండలం అవుసులపల్లి గ్రామంలో 50 ఎకరాలు, పాపన్నపేట మండలంలోని నామాపూర్, చిత్రియాల్ తండా, అమ్రియా తండా, అన్నారం, అబ్లాపూర్ గ్రామాల్లో వేలాది ఎకరాలు ఆక్రమణకు గురైంది.

మూడు ఇళ్లలో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో గురువారం అర్ధ రాత్రి గుర్తు తెలియని దొంగలు బీభీత్సం సృష్టించారు. తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం అపహరించారు. శుక్రవారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. వెల్మకన్న గ్రామానికి చెందిన చాకలి లింగమ్మ కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడే పనులు చేసుకుంటున్నారు. 5న కూతురు సునీతతో కలిసి గ్రామానికి వచ్చింది. ఇంట్లో ఫ్యాన్ పాడైపోవడంతో ఆదే రోజు రాత్రి పాలివారైన చాకలి బుజ్జమ్మ ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి దొంగలు ఇంట్లో చొరబడి బీరువాలోని రూ.5 వేల నగదు, హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న రూ.20 వేలు, అర తులం బంగారు ఉంగరం, 20 తులాల వెండి పట్టగొలుసులు, 10 తులాల వెండి కడియాలు ఎత్తుకెళ్లారు. దీంతోపాటు చాకలి వెంకటేశం ఇంట్లో రూ.20 వేలు, మాణిక్య వెంకటేశం ఇంట్లో రూ.5 వేలు నగదు, రూ.3 వేలు విలువ చేసి యూస్‌డాలర్లు దొంగలు చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్‌టీం అధికారులు ఘటనా స్థలాలన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై వెళ్తుండగా గొలుసు చోరీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం మేరకు.. జహీరాబాద్ ప్రాంతానికి చెందిన సంగన్న రుక్మిణి దంపతులు శుక్రవారం సాయంత్రం బైక్‌పై రేజింతల్ గ్రామానికి వస్తున్నారు. ఖలీల్‌పూర్ గ్రామ శివారులోకి రాగానే వెనుకాల బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి రుక్మిణి మెడలోని సుమారు 3 తులాల బంగారు గొలుసును తెంచుకొని వెళ్లారు. బాధితులు హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

ప్రేమ పెళ్లికి నిరాకరించారని..

గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య

దుబ్బాకరూరల్: గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. సోమారపు ప్రభుదాస్(22) రెండేళ్ల కిందట హైద్రాబాద్‌లోని ఓలా క్యాబ్ డ్రైవర్‌గా పని చేశాడు. మూడు నెలల కిందట గ్రామానికి వచ్చాడు. హైద్రాబాద్‌లో ఓ అమ్మాయిని ప్రేమించానని ఆమెనే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు. దీనికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. అప్పటి నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇటీవలె మళ్లీ ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. మన కులంలో అమ్మాయిని చూసి పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు ప్రభుదాస్‌ను మందలించారు. ఈ క్రమంలో 5వ తేదీన పొలం వద్ద గడ్డి మందు తాగి వాంతులు చేసుకుంటుండగా తల్లిదండ్రులు రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో..

మనోహరాబాద్(తూప్రాన్): అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన మంచోళ్ల రేణిశ్ (27) పదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన నేతికుంట అనూరాధను వివాహం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మూర్ఛవ్యాధి ఉండటంతో మందులు వాడుతున్నాడు. అనారోగ్యంతో నిత్యం బాధపడుతూ శుక్రవారం ఉదయం ఇంటి బెడ్రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఏఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి..

చేర్యాల(సిద్దిపేట): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నాగపురి గ్రామంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుచ్చెల్లి కుమార్(45) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన కుమార్ ఏ పని చేయకుండా డబ్బుల కోసం భార్యతో గొడవ పడుతుండేవాడు. గురువారం రాత్రి భార్యతో గొడవపడ్డ కుమార్ ఇంట్లో నుంచి భార్య, కూతురును బయటకు వెళ్లగొట్టాడు. అనంతరం ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

బంధువులను పరామర్శించేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

మర్కూక్(గజ్వేల్): ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్ కథనం మేరకు.. మూడు చింతలపల్లి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్(38) బంధువులు గజ్వేల్ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించేందుకు గురువారం వెళ్లాడు. సాయంత్రం స్వగ్రామమైన తిరుగు ప్రయాణంలో నారాయణపూర్‌కు బైక్‌పై వస్తుండగా మర్కూక్ మండల కేంద్రంలోని కొండపోచమ్మ సాగర్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన బాధితుడిని అటుగా వెళ్తున్న వారు చూసి బంధువులకు సమాచారం ఇచ్చారు. కారులో ములుగు మండలంలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి అప్పటికే చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ధనలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కూలేదాక స్పందించరా..?

- శిథిలావస్థకు చేరిన పాఠశాలలను కూల్చేయండి
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి
- ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందర్‌రావు

మెదక్‌జోన్: పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో వెంటనే కూల్చాలని 2013లో తీర్మానం చేసినా మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఎందుకు డిస్మెంటల్ చేయలేదని, విద్యార్థులపై కూలి ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ఎంపీ రఘునందన్‌రావు అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి కో ఆపరేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఏడేళ్ల కింట పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో 10 గదులు కూలగొట్టాలని మున్సిపల్ శాఖ తీర్మానం చేసినా దాన్ని ఎందుకు కూల్చలేదని డీఈఓ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలపై మండిపడ్డారు. వెంటనే డిస్మెంటల్ చేయాలని ఆదేశించారు. మెదక్, నర్సాపూర్ మున్సిపాలిటీల్లో పూర్తి అయిన డబుల్ బెడ్రూం ఇళ్లతోపాటు అర్ధాంతరంగా ఆగిపోయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. జిల్లాలో డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మెడికల్ కళాశాలలు నిలిచిపోయాయని వాటిలో మెదక్ ఉందన్నారు. గుంపు మేస్త్రీ ఏం చదువుకున్నారో.. తనకే తెలియదని, విద్యా సంవత్సరం మధ్యలో తాత్కాలిక గురుకుల ఉపాధ్యాయులను తొలగిస్తే వారి పరిస్థితి ఏమిటని రఘునందన్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా తాత్కాలిక గురుకుల ఉపాధ్యాయులు కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ మున్సిపల్ చైర్మన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి అమ్ముకొని డబ్బులు ఇస్తలేడు

పురుగుల మందుతో బాధితుల నిరసన



దుకాణం ఎదుట బైఠాయించిన బాధితులు

సిద్దిపేటజోన్: తమ వ్యక్తిగత అవసరాలకు భూమిని తనఖా పెట్టి అప్పు తీసుకుంటే ఇప్పుడు మా భూమిని అమ్ముకొని తనకు ఏమి తెలియదని బుకాయిస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని బాధితులు పురుగుల మందు డబ్బాతో అప్పు ఇచ్చిన వ్యక్తి దుకాణం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బాధితుల కథనం ప్రకారం.. నారాయణరావు పేట మండలంలోని జక్కాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల కవిత, శ్రీనివాస్ రెడ్డి దంపతులు తమ అవసరాల నిమిత్తం ఇమాంబాద్‌కు చెందిన తిరుపతి వద్ద ఎకరా భూమిని(రిజిస్ట్రేషన్)తనఖా పెట్టి రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నారు. కొంతకాలానికి వడ్డీ కింద సుమారు రూ.2 లక్షలు చెల్లించారు. కానీ తిరుపతి ఆ భూమిని బాధితులకు తెలియకుండా రూ.23 లక్షలకు వేరొకరికి విక్రయించాడు. విషయం తెలుసుకున్న దంపతులిద్దరూ అప్పు, వడ్డీ పోగా మిగిలిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడు ఇవ్వకపోవడంతో శుక్రవారం బాధితులు జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న ఆయన మందుల దుకాణం ఎదుట పురుగు మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువురిని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

నకిలీ విత్తనాలు ఇచ్చారంటూ రైతు..

మద్దూరు(హుస్నాబాద్): నకిలీ విత్తనాలు ఇచ్చి మోసం చేశారని, తనకు న్యాయం చేయాలంటూ ఓ రైతు చేనులో క్రిమిసంహారక మందు డబ్బాలతో నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే.. ధూళ్మిట్ట మండల పరిధిలోని కూటిగల్ గ్రామానికి చెందిన కొమ్మ రాజుల రమేశ్ తనకున్న 3 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. గ్రామానికి చెందిన ప్రవళిక ఫర్టిలైజర్ నుంచి విత్తనాలు కొనుగోలు చేశాడు. ఈ మందులు వాడితే ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నిర్వాహకుడు చెప్పాడని, కానీ కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతు వాపోయాడు. తనకు న్యాయం చేయకపోవతే క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశాడు.

మీలో ఎవరు లక్షాధికారి..!

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

- విజేతలకు రూ.లక్షల్లో నగదు
- 17 వరకు దరఖాస్తులకు అవకాశం
- 19 నుంచి 21 వరకు ఆన్‌లైన్ పోటీలు
- మెదక్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం



మెదక్ కలెక్టరేట్: డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొని రూ.లక్షలు గెలుచుకునే అవకాశం కల్పించింది. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) సేవలు 90 ఏళ్లలోకి చేరుకున్న సందర్భంగా విజ్ఞాన వంతులైన డిగ్రీ విద్యార్థులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

డిజిటల్ సేవలపై అవగాహనే లక్ష్యం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక పర్యావరణ వ్యవస్థపై మరింత అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ క్విజ్ నిర్వహిస్తున్నారు. గత ఆగస్టు 20న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో క్విజ్‌ను ప్రారంభించారు. ఆన్‌లైన్ దశతో ప్రారంభించి, రాష్ట్ర, జోనల్ స్థాయి రౌండ్‌ల తర్వాత జాతీయ స్థాయితో ఫైనల్‌లో ముగుస్తుంది.

ఎంతమందైనా పాల్గొనవచ్చు

ఒక్కో కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైన పాల్గొనవచ్చు. 25 ఏళ్లలోపు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ పొంది ఉండాలి. ఈనెల 17వ తేదీతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తారు.


నాలుగు దశల్లో పోటీలు

జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దశ నుంచి క్విజ్ పోటీ ప్రారంభమవుతుంది. తర్వాత రాష్ట్రస్థాయి, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయి. ఇంగ్లిష్, హిందీ భాషల్లోనే పోటీలు నిర్వహిస్తారు. ప్రధానంగా దేశ, అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు, ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర, సాహిత్యం, సైన్స్, టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై క్విజ్ ఉంటుంది.

బహుమతుల వివరాలు ఇలా..

జాతీయస్థాయిలో..	
ప్రథమ	: రూ.10 లక్షలు
ద్వితీయ	: రూ.8 లక్షలు
తృతీయ	: రూ.6 లక్షలు
జోనల్ స్థాయిలో..	
ప్రథమ	: రూ.5 లక్షలు
ద్వితీయ	: రూ.4 లక్షలు
తృతీయ	: రూ.3 లక్షలు
రాష్ట్ర స్థాయిలో..	
ప్రథమ	: రూ.2 లక్షలు
ద్వితీయ	: రూ.1.50 లక్షలు
తృతీయ	: రూ.లక్ష

విద్యార్థులకు అవగాహన



మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్సింహ మూర్తి

రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థుల కోసం చేపట్టిన ఆన్‌లైన్ క్విజ్ పోటీలు మంచి కార్యక్రమమని లీడ్ బ్యాంక్(ఎల్‌డీఎం) మేనేజర్ నర్సింహ మూర్తి తెలిపారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు సంబంధించి శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప అవకాశం



మెదక్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మొత్తం 26 ఉండగా సుమారు 9,600 వరకు విద్యార్థులు ఉన్నారు. ఆర్‌బీఐ అందిస్తున్న గొప్ప అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులంతా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని తమ ప్రతిభను చాటి రూ.10 లక్షల ప్రైజ్‌మనీ సాధించాలి.

– డాక్టర్ కే.హుస్సేన్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్

మంజీరా నదికి పెరుగుతున్న వరద ఉధృతి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించి పూజలు

నారాయణఖేడ్: కర్ణాటక నుంచి వస్తున్న వరద ఉధృతితో మంజీరా నదిలోకి భారీగా వరదనీరు చేరుతుంది. ఈ సందర్భంగా శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మనూరు మండలంలోని బోరంచ మంజీరా నది వద్ద నదితోపాటు సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నీటితో ముమ్మందు తాగు, సాగునీటి పరంగా ఇబ్బందులు తలెత్తవని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వర్షాల వల్ల ప్రాంతంలో అంతగా పంటనష్టం జరగలేదని, ఏమైనా నష్టం జరిగిన పక్షంలో ప్రభుత్వం సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పంట, ఆస్తి నష్టాలపై అధికారులకు ఇదివరకే సూచనలు చేశామని, తగు నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలని సూచించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహా రెడ్డి, నాయకులు వెంకట్, నర్సింహులు, మల్లయ్య, నర్సింహారెడ్డి, మల్లేశ్, శ్రీకాంత్‌రెడ్డి, అఖిలేష్ రెడ్డి, నర్సింహులు, బీరప్ప, సాజిద్, పుట్టి బక్కుల్, దత్తు ఉన్నారు.